సాక్షి సూర్యాపేట

ఆదివారం । 21 । జూలై । 2024



సమగ్ర కులగణన జరపాలి
సమగ్ర కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కేంద్రాన్ని కోరారు. - 8లో



గంజాయి ముఠా అరెస్ట్
మునుగోడులో కొంతకాలంగా గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు ముఠా సభ్యులను స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. - 10లో



కాలుష్యాన్ని నియంత్రించాలి
మూసీ కాలుష్యాన్ని నియంత్రించాలని అఖిల భారత కిసాన్ సంఘం జాతీయ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. - 10లో

న్యూస్‌రీల్

అర్చకుల బదిలీల నిలుపుదల హర్షణీయం

భానుపురి (సూర్యాపేట): దేవాదాయ శాఖలో అర్చకుల బదిలీల ప్రక్రియను సీఎం రేవంత్ రెడ్డి నిలిపివేస్తున్నట్లు ప్రకటించడం హర్షణీయమని అర్చక సంఘం జేఏసీ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు వలివేటి వీరభద్ర శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్చక బదిలీలు నిలిపివేయాలని అర్చక జేఏసీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి వినతి పత్రం అందించడంతో వెంటనే స్పందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అర్చకుల సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.

ఏజీపీల నియామకం



నట్టే సత్యనారాయణ



బానోతు సురేష్‌నాయక్

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా న్యాయవాది నట్టే సత్యనారాయణ, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా న్యాయవాది బానోతు సురేష్‌నాయక్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. తమ నియామకానికి సహకరించిన మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



తెల్లబెల్లిలో డ్రెయినేజీని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్

నడిగూడెం : ప్రస్తుత వానాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా అటవీశాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి పి.సతీష్ కుమార్ కోరారు. నడిగూడెం మండలం తెల్లబెల్లిలో విషజ్వరాలు ప్రబలుతుండడంతో శనివారం ఆయన గ్రామాన్ని సందర్శించారు. వీధుల్లో పారిశుద్ధ్యాన్ని, పంచాయతీ కార్యాలయంలో రిజిస్టర్‌లను పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్, ఎంపీఓ దుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

పాత పనివేళలే కొనసాగించాలి

పెన్‌పహాడ్: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేళలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ధరావత్ వస్రాం నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన పెన్‌పహాడ్ మండల కేంద్రంలో మాట్లాడారు. ఇప్పటి వరకు ఉదయం 9.30నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు ఉన్న పనివేళలను ఇకనుంచి ఉదయం 9 గంటల ఉంచి సాయంత్రం 4.15 గంటల వరకు మార్చడం వల్ల గ్రామీణ ప్రాంతాల నుంచి, గిరిజన తండాల నుంచి సుమారు 4 కిలో మీటర్ల దూరం నడుచుకుంటూ వచ్చే విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఈ నేపథ్యంలో పాత పనివేళలనే కొనసాగించాలన్నారు.

మట్టపల్లిలో నారసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగాగా ఆలయంలో సుప్రభాత సేవ, పూజలు, అభిషేకాలు, నిత్యాగ్నిహోత్రి, అష్టోత్తర సహస్ర నామార్చలు గావించారు. నూతన పట్టువస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. అనంతరం కల్యాణతంతు నిర్వహించి మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, అర్చకులు తూమాటి కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనర్సింహమూర్తి, ఆంజనేయచార్యులు, భక్తులు పాల్గొన్నారు.



మంగళసూత్రం చూపిస్తున్న అర్చకుడు

ముసురుకున్న వర్షం

భానుపురి (సూర్యాపేట): జిల్లా అంతటా ముసురు పట్టింది. తుపాన్ ప్రభావంతో శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం రాత్రి వరకు అన్ని మండలాల్లోనూ చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం పడింది. శనివారం ఉదయం 8.30గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు జిల్లాలో సరాసరి 9.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మునగాలలో 18.0 మి.మీ, చివ్వెంలలో 15.7 మి.మీల చొప్పున వర్షపాతం నమోదైంది. ఆత్మకూర్‌లో 14.5, జాజిరెడ్డిగూడెం, నడిగూడెంలో 14.0, నాగారంలో 13.7, తిరుమలగిరిలో 12.8, చిలుకూరులో 12.3, సూర్యాపేటలో 10.7, మద్దిరాలలో 10.3 మి.మీ చొప్పున వర్షాపాతం నమోదైంది. కాగా రాష్ట్రవ్యాప్తంగా నాలుగైదు రోజుల భారీ వర్షాలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించడంతో జిల్లా యంత్రాంగం అలర్ట్ అయ్యింది.



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. శుక్రవారం వెబెక్స్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడారు. ప్రతి అధికారి విధులు నిర్వహించే కార్యస్థానాలను విడిచి వెళ్లకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పురాతన ఇళ్లు, శిథిలమైన పాఠశాల భవనాలను గుర్తించాలని, లోలెవెల్ బ్రిడ్జిలు, రోడ్లపై వరద ఉధృతంగా ప్రవహిస్తున్నప్పుడు ప్రజలు ఆయా ప్రాంతాలకు వెళ్లకుండా అధికారులు అప్రమత్తం చేయాలన్నారు. చేపల వేటకు వెళ్లవద్దన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర సేవల నిమిత్తం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబరు **6281492368**కు ప్రజలు ఫోన్ చేసి సమస్యలను తెలపాలన్నారు.

మేలుకోకుంటే ముప్పే

- సూర్యాపేటలో పారిశుద్ధ్య నిర్వహణ అంతంతే
- వర్షాకాల సీజన్ ప్రారంభమైనా ప్రత్యేక చర్యలు శూన్యం
- ఎక్కడికక్కడ నిల్వ ఉంటున్న మురుగు
- ప్రబలనున్న డెంగీ, విషజ్వరాలు
- భయాందోళనలో పట్టణ ప్రజలు



సూర్యాపేట పట్టణంలోని తాళ్లగడ్డలో ఇళ్ల మధ్య రోడ్డుపై నిలిచిన మురుగునీరు

సూర్యాపేట: జిల్లా కేంద్రమైన సూర్యాపేట మున్సిపాలిటీలో సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. మున్సిపల్ అధికారులు వివిధ వార్డుల్లో సక్రమంగా పారిశుద్ధ్య పనులు చేపట్టడం, దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగానే ఉంటుండడంతో ఏటా డెంగీ, సీజనల్ వ్యాధుల బారినపడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే విమర్శలున్నాయి. గత ఏడాది వర్షాకాలంలో డెంగీ జ్వరంతో సుమారు పట్టణంలోనే 40 మందికిపైగా ఆస్పత్రుల పాలయ్యారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని వర్షాకాల నేపథ్యంలో డెంగీ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

భయపెడుతున్న డెంగీ..

వర్షాకాలం వస్తేచాలు సీజనల్ వ్యాధులు ప్రధానంగా డెంగీ ప్రజలను భయపెడుతోంది. పూర్తిగా వర్షాలు కురవక ముందే దోమలు వృద్ధి చెందకుండా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలి. డెంగీ దోమలు వ్యాప్తిచెందకుండా చూడాలంటే నీటి నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి. నిల్వ ఉన్న నీటిలో లార్వా ఉత్పత్తి జరిగి డెంగీ దోమగా రూపాంతరం చెందుతుంది. ఇలాంటి భయంకరమైన డెంగీ దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది.

పేట మున్సిపాలిటీ వివరాలు	
వార్డులు	48
జనాభా	2.50లక్షలు
నివాసగృహాలు	32 వేలు
గతేడాది డెంగీ కేసులు	40

చర్యలు నామమాత్రమే..

పట్టణంలో డెంగీ డేంజర్ బెల్స్ మోగుతున్నప్పటికీ అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వార్డుకు ఒక కార్మికుడిని నియమించి యాంటీలార్వా స్ప్రే చేయిస్తున్నారు. అయితే ఇళ్ల మధ్యలో నిల్వ ఉన్న నీటిని తొలగించడంలో ఇప్పటికీ అలసత్వం వహిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ప్రస్తుత సీజన్‌లో ఇంతవరకు ఫ్రై డే.. డ్రై డేలను కూడా ప్రారంభించలేదని ప్రజలు అంటున్నారు.

హైరిస్క్ జోన్లల ఊసేలేదు

గతేడాది పట్టణంలో 40 వరకు డెంగీ కేసులు నమోదయ్యాయి. డెంగీ ప్రబలిన ప్రాంతాలను హైరిస్క్ జోన్‌లుగా గుర్తించారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ నేటికీ హైరిస్క్ జోన్లను గుర్తించలేదు. మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా మేల్కొనాలని ప్రజలు కోరుతున్నారు.

వేసవిలోనూ డెంగీ కేసులు

సాధారణంగా డెంగీ కేసులు వర్షాకాలంలోనే ఎక్కువగా నమోదవుతుంటాయి. కానీ పట్టణంలో ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ నెల వరకు దాదాపు 11 డెంగీ కేసులు నమోదయ్యాయి. పట్టణంలో ఏడాది పొడవునా డెంగీ ప్రబలే ప్రమాదం ఉన్నందున నిరంతరం పారిశుద్ధ్య చర్యలు చేపట్టాల్సి ఉంది. మిషన్ భగీరథ పైప్‌లైన్లు వేసి అనేకచోట్ల నల్లా కనెక్షన్లకు ట్యాపులు ఏర్పాటు చేయలేదు. దీంతో నీరు వృథాగా వెళ్లి మురుగు కాల్వల్లో చేరడంతో దోమలు వ్యాప్తిచెందుతున్నాయి.

ప్రత్యేక సిబ్బందిని నియమిస్తాం..



వర్షాకాలం ప్రారంభమైంది. అన్ని వార్డుల్లో దోమల నివారణకు పూర్తిస్థాయిలో చర్యలు చేపడతున్నాం. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం. హైరిస్క్ జోన్‌లను గుర్తించి ప్రత్యేక సిబ్బందిని నియమించి డెంగీ, విష జ్వరాలు ప్రబలకుండా చూస్తాం. ప్రజలు ఎవరూ ఆందోళన చెందొద్దు.
- బి.శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, సూర్యాపేట

దోమలు ప్రబలకుండా చూడాలి

మా వార్డు పూర్తిగా పుల్లారెడ్డి చెరువుకు ఆనుకుని ఉంటుంది. దోమలు విపరీతంగా వస్తున్నాయి. దోమల నివారణకుచర్యలు చేపట్టడం లేదు. ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు వర్షాకాలం సమయంలో కూడా అందుబాటులో ఉండడం లేదు. దోమలు ప్రబలకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి.
- రాజేష్, పీఎస్సార్ సెంటర్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

సూర్యాపేట రూరల్: విద్యార్థులకు నాణ్యయమైన మధ్యాహ్న భోజనంతోపాటు మెరుగైన విద్యనందించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. శనివారం సూర్యాపేట మండలం టేకుమట్ల జెడ్పీహెచ్ఎస్, ప్రైమరీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్కూల్, మూసీ ప్రాజెక్టు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్, ఏఈ ఉదయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



టేకుమట్ల హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువు



జెండా ఎగురవేస్తున్న రామలింగమ్మ, చిత్రంలో ఝాన్సీ, పీఓడబ్ల్యూ ప్రతినిధులు

కోదాడ రూరల్: కేంద్రంలోని బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని, లైగింక వేధింపులు, హత్యాచారాలు, హత్యలు, గృహహింసలు మరింత పెరిగాయని పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.ఝాన్సీ అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని లాల్ బంగ్లాలో ప్రగతి శీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ)జిల్లా 7వ మహాసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. స్త్రీ, పురుష సమానత్వం, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమభాగస్వామ్యం కోసం గత అర్ధశతాబ్దం నుంచి పీఓడబ్ల్యూ అనేక పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌పై పార్లమెంట్‌లో చట్టం చేసినా అది అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్‌కుమార్ ముగింపు ఉపన్యాసం చేశారు. మహాసభకు ముందు సంఘ జిల్లా ఉపాధ్యక్షురాలు రామలింగమ్మ జెండాను ఎగురవేశారు. రామలింగమ్మ, పి.లక్ష్మి, వాణిశ్రీల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నర్సమ్మ, మేకల రాజేశ్వరి, పుసులు సుజాత, బయ్య జయమ్మ, ఐలమ్మ, లక్ష్మి, శాంతమ్మ, కావ్య, సైదమ్మ, లింగమ్మ, ఉపేంద్ర, జయసుధ, సంపూర్ణ, సంతోష తదితరులు పాల్గొన్నారు.

నేడు ధర్మచక్ర పరివర్తన దినోత్సవం

నాగార్జునసాగర్: సాగర్ బుద్ధవనంలో ఆదివారం తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ధర్మచక్ర పరివర్తన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. సిద్ధార్థుడు బుద్ధుడై ఆర్యసత్యాలు, అష్టాంగ మార్గాన్ని ఆషాఢ పూర్ణిమ రోజున బోధించాడని, ఈరోజును ధర్మచక్ర పరివర్తన దినోత్సవంగా జరుపుతున్నామని పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు మహాస్థూపం సమావేశ మందిరంలో జరిగే ఈ కార్యక్రమానికి పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి, భూటాన్ విద్యాశాఖ మాజీ మంత్రి ఆచార్య ఠాకూర్ సింగ్ పొడ్యేల్, సంగీత విద్వాంసులు డాక్టర్ మధుసారథి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పాల్గొంటారని తెలిపారు.

కోర్టుల్లో సమస్యల పరిష్కారానికి కృషి



హుజూర్‌నగర్ : జిల్లా ప్రధాన జడ్జి గోవర్ధన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు

- హుజూర్‌నగర్‌కు మరో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి
- కోదాడ, హుజూర్‌నగర్ కోర్టుల సందర్శన

హుజూర్‌నగర్, కోదాడ: హుజూర్‌నగర్, కోదాడ కోర్టుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతోపాటు సిబ్బంది కొరత తీరుస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన హుజూర్‌నగర్, కోదాడలో కోర్టుల నూతన భవనాల స్థలాలను పరిశీలించారు. మొదటిసారి హుజూర్‌నగర్, కోదాడకు వచ్చిన జిల్లా ప్రధాన జడ్జిని బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయా చోట్లలో ఆయన మాట్లాడారు. హుజూర్‌గనర్ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికే హుజూర్‌నగర్‌కు మరో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరునకు హైకోర్టుకు ప్రతిపాదనలు పంపుతానన్నారు. హుజూర్‌నగర్ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభోత్సవం ఏర్పాట్లను పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఫణిగిరిగుట్ట వద్ద న్యాయమూర్తుల నివాస భవన సముదాయాల నిర్మాణాలకు కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో కోర్టు భవనాలను నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్, కోదాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, అడిషనల్ సివిల్ జడ్జిలు శ్యాంసుందర్, భవ్య, హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్, హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సాముల రాంరెడ్డి, జక్కుల వీరయ్య, అధికార ప్రతినిధి కాల్వ శ్రీనివాస రావు, జిల్లా కోర్టు పీపీ బొబ్బా కోటిరెడ్డి, కోదాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గట్ల నర్శింహారావు, ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, మాజీ అధ్యక్షులు మేకల వెంకట్రావు, పట్టణ సీఐ రాము, ఎస్ఐ మల్లేష్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, ఆయా కోర్టుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కోదాడ కోర్టు నూతన భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి గోవర్ధన్‌రెడ్డి

అధిక ధరలకు బాండ్ పేపర్లు!

- ప్రభుత్వం కమీషన్ ఇస్తున్నా మారని స్టాంప్ వెండర్ల తీరు
- రూ.50, రూ.100 పేపర్లపై అదనంగా వసూలు
- కరువైన అధికారుల పర్యవేక్షణ

సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యాపారికి రూ.100 బాండ్ పేపర్లు ఐదు అవసరం పడ్డాయి. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని ఓ స్టాంప్ వెండర్ వద్దకు వెళ్లి ఒక్కో దానికి రూ.50 అదనంగా కలిపి మొత్తం రూ.750 చెల్లించి తీసుకున్నాడు. స్టాంప్ వెండర్ వద్ద రూ.50 బాండ్ పేపర్లు ఉన్నా అవి లేవని రూ.వంద బాండ్ పేపర్లు విక్రయిస్తూ దోచుకుంటున్నాడు. ఇలా జిలాల్లో చాలాచోట్ల బాండ్ పేపర్ల కృత్రిమ కొరత సృష్టిస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.



సూర్యాపేట: నిఘా నిద్రపోతుంటే.. దగా దండుకుంటోంది అన్నట్టుగా ఉంది సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాండ్ పేపర్ల విక్రయాలు పరిస్థితి. స్టాంప్ వెండర్లు అధిక ధరలకు విక్రయిస్తున్నా.. చేసేదేమి లేక అవసరాలను బట్టి ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల సంక్షేమ పథకాలు అమలు, విద్యార్థుల ఉపకార వేతనాలు, స్థిరాస్తి ఒప్పందాలు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు, రుణాలు పొందేందుకు స్టాంపు పేపర్ల వినియోగం బాగా పెరిగింది. దీంతో స్టాంపు వెండర్లు బాండ్ పేపర్లను నిబంధనల ప్రకారం విక్రయించాల్సిన ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తూ ప్రజలను దోచుకుంటున్నారు.

ఇష్టానుసారంగా విక్రయాలు

సూర్యాపేట జిల్లా కేంద్రంలో స్టాంపు వెండర్లపై పర్యవేక్షణ కరువైంది. దీంతో ప్రభుత్వం వారికి కమీషన్ ఇస్తున్నా.. ఇష్టానుసారంగా విక్రయాలు చేపడుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న స్టాంపు వెండర్లు రూ.50 విలువైన స్టాంప్ పేపర్‌ను రూ.100, రూ.100 విలువైన పేపర్లను రూ.150 వరకు విక్రయిస్తూ దండుకుంటున్నారు. రోజూ జిల్లా కేంద్రంలో ఇదేతంతు జరుగుతున్నా.. సంబంధిత శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా బాండ్ పేపర్లను నిర్ణీత ధరలకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదాలకు దూరంగా ఉండాలి

- ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేట టౌన్: అధిక వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు, రైతులు, వాహనదారులు, ప్రయాణికులు జాగ్రత్తలు పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఏదైనా అత్యవసరమైతే ప్రజలు స్థానిక పోలీసులకు, డయల్ 100కు ఫోన్ చేసి పోలీస్ సేవలను పొందవచ్చని తెలిపారు. నీటి ప్రవాహాల వద్దకు వెళ్లి సెల్ఫీ ఫొటోలు దిగుతూ ప్రమాదాల బారిన పడొద్దని పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో శిథిల భవనాల్లో ఉండొద్దని, చెరువులు, వాగులు, రిజర్వాయర్లు, లోతట్టు ప్రాంతాల్లో చేపల వేటతోపాటు సరదా కోసం వెళ్లొదని సూచించారు. వాతావరణం తడిగా ఉన్నందున కరెంట్ స్తంభాలను తాకవద్దని, సాధారణ ప్రజలు కరెంట్ రిపేర్ పనులు చేయవదని పేర్కొన్నారు. రోడ్లపై వర్షం నీరు చేరడం వల్ల వాహనాలు అదుపుతప్పే అవకాశం ఉన్నందున ప్రయాణ సమయంలో వాహనదారులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, వాహనాలు వేగంగా నడపవద్దని పేర్కొన్నారు. వ్యవసాయ పనుల్లో రైతులు జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని కోరారు.



యూనిఫాం కుట్టుకూలికి రూ.26.82 లక్షలు

- మహిళా సంఘాలకు విడుదల చేసిన ప్రభుత్వం
- 53,638 మంది విద్యార్థులకు ఒక్కో జత అందజేత
- మిగతా నిధులిస్తేనే రెండో జత యూనిఫాం కుడతామంటున్న మహిళలు

సూర్యాపేట టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫాం కుట్టిన జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇటీవల ప్రభుత్వం కుట్టు కూలి నిదులు విడుదల చేసింది. ఈ నిధులను పాఠశాల విద్యా శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ జిల్లాల వారీగా కేటాయించారు. ఒక్కో జతకు రూ.50 చొప్పున సంఘాల మహిళలకు అందజేశారు. మొదటి విడతలో భాగంగా జిల్లాలోని మొత్తం 950 స్కూళ్లలో 53,638 మంది విద్యార్థులకు యూనిఫాం కుట్టు కూలి కింద రూ.26,81,900 విడుదలయ్యాయి.



చెప్పింది రూ.75.. ఇచ్చింది రూ.50

ఒక్కో జత యూనిఫాంకు ప్రభుత్వం మొదట రూ.50 నిర్ణయించింది. అయితే సంఘాల సభ్యులు కుట్టుకూలి సరిపోదని చెప్పడంతో రూ.50 నుంచి రూ.75కు పెంచారు. అయితే మొదటి విడతలో చెల్లించిన కుట్టుకూలి నిధుల్లో భాగంగా ఒక్కో జతకు కేవలం రూ.50 చెల్లించారు. అయితే ప్రభుత్వం చెప్పినట్టుగా జతకు రూ.75 కాకుండా రూ.50 చెల్లించడంపై సంఘాల సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విడుదలైన నిధులను విద్యా శాఖ అధికారి ఖాతాలో వేయగా అక్కడ నుంచి మండల సమాఖ్య ఖాతాలకు బదలాయిస్తున్నారు. మండల సమాఖ్యకు వచ్చిన డబ్బులను యూనిఫాంలు కుట్టిన మహిళల ఖాతాలో జమ చేయనున్నారు. అయితే పూర్తి డబ్బులు రాకముందే అధికారులు రెండో జత కూడా కుట్టించడానికి కసరత్తు చేస్తున్నారు. మొదటి విడతలో రావాల్సిన మొత్తం నిధులు విడుదల చేస్తేనే రెండో జత కుడతామని స్వయం సహాయక సంఘాల సభ్యులు చెబుతున్నారు.

నిధులు విడుదలయ్యాయి

పాఠశాల విద్యా శాఖ నుంచి ఒక్కో జతకు రూ.50 చొప్పున నిధులు విడుదలయ్యాయి. మిగతా డబ్బులు కూడా త్వరలోనే విడుదలవుతాయి. మహిళా సంఘాల సభ్యులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.
- అశోక్, డీఈఓ, సూర్యాపేట

క్లుప్తంగా

శతాధిక వృద్ధురాలు మృతి



ఎల్లమ్మ (ఫైల్)

రాజాపేట: మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు తాళ్లపల్లి ఎల్లమ్మ (101) శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. వారం రోజుల క్రితం వరకూ ఎల్లమ్మ తన పనులు తాను చేసుకునేదని అనారోగ్యానికి గురి కావడంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎల్లమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె, 9 మంది మనుమళ్లు, మనుమరాళ్లు ఉన్నారు.

రోడ్డుప్రమాదంలో వృద్ధురాలు మృతి



సుగుణమ్మ (ఫైల్)

చిట్యాల: పట్టణంలోని జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. శనివారం చిట్యాల ఎస్‌ఐ సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణంలోని సంతోష్‌నగర్‌కు చెందిన సంగిశెట్టి సుగుణమ్మ (68) శుక్రవారం వనిపాకల రోడ్డులో గల తమ బంధువుల ఇంటికి వెళ్లింది. తిరిగి సాయంత్రం తన ఇంటికి వచ్చేందుకు జెడ్పీహెచ్‌ఎస్ సమీపంలోని జాతీయ రహదారిని దాటుతుండగా హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన సుగుణమ్మను చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న సుగుణమ్మ అదే రోజు రాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడు లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహానికి నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేసి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

నిండా మునిగిన బత్తాయి రైతులు

- తిరుపతి ఉద్యాన యూనివర్సిటీ నుంచి రంగాపూర్ బత్తాయి అంటు మొక్కలు దిగుమతి
- పదేళ్లు గడిచినా సక్రమంగా రాని దిగుబడి
- జిల్లాలో 350 ఎకరాల్లో ఈ బత్తాయి మొక్కలు నాటిన రైతులు



సక్రమంగా దిగుబడి లేని బత్తాయి తోట

నల్లగొండ రూరల్: తిరుపతి ఉద్యాన యూనివర్సిటీ నుంచి 2014, 2015, 2016 సంవత్సరాల్లో బత్తాయి మొక్కలు తీసుకొచ్చి జిల్లాలో నాటిన రైతులు దిగుబడి రాక నిండా మునిగారు. గత పదేళ్లుగా పెట్టిన పెట్టుబడి బూడిదలో పోసిన పన్నీరులా మారిందని వాపోతున్నారు. గతంలో తిరుపతి ఉద్యాన యూనివర్సిటీ నుంచి రంగాపూర్ బత్తాయి అంటు మొక్కలను తీసుకొచ్చి జిల్లాలో విస్తారంగా నాటి మన్నికైన దిగుబడిని పొందారు. 2014 నుంచి ఈ రంగాపూర్ బత్తాయి అంటు మొక్కలు నాణ్యతగా లేకపోవడంతో అవి నాటిన రైతులు దిగుబడి రాక దివాలా తీశారు. జిల్లాలో 68 మంది రైతులు 350 ఎకరాల్లో ఈ బత్తాయి మొక్కలు నాటారు. అంటు మొక్కలు సాధారణంగా 4వ ఏట నుంచి దిగుబడి ప్రారంభమవుతుంది. 8 ఏళ్లు గడిచినా సాధారణ దిగుబడి కూడా రావడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు.

ఫలితమివ్వని పరిశోధనా కేంద్రం మొక్కలు..

తిరుపతి ఉద్యాన యూనివర్సిటీ మొక్కలు సాగు చేస్తే 25ఏళ్ల పాటు మంచి దిగుబడి వస్తుందని తెగుళ్లు, నీటి ఎద్దడిని తట్టుకుంటుందని అధికారులు రైతుల్లో అవగాహన కల్పించారు. దీంతో ఆ బత్తాయి మొక్కలు నాటిన రైతులు దిగుబడి లేక నేడు దివాలా తీశారు. పరిశోధనా కేంద్రంలో ఆరోగ్యవంతంగా ఉన్న తల్లి మొక్క నుంచి 10 నుంచి 20 కొమ్మలు తొలగించి నిమ్మ జాతికి చెందిన రంగాపూర్ మొక్కపై అంటుకడతారు. ఇలా అంటు కట్టడం వల్ల తెగుళ్లు తట్టుకోవడం, నీటి ఎద్దడిని తట్టుకోవడంతో పాటు నాణ్యతమైన దిగుబడి లభిస్తుంది. తిరుపతి నుంచి తెచ్చి నాటిన మొక్కల్లో దిగుబడి నిమ్మకాయ సైజు కంటే కొంచెం పెద్దగా ఉండటం కొద్దిరోజుల్లోనే పసుపు రంగులోకి మారి రోజుల వ్యవధిలోనే రాలిపోతుంది. ఎక్కువగా బంక తెగులు సోకి చెట్లు ఎండిపోతున్నాయి. సాధారణంగా ఎకరానికి 8 నుంచి 10 టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా.. రైతులు తెచ్చి నాటిన మొక్కల్లో కనీసం 5 టన్నుల దిగుబడి రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు నష్ట పరిహారం చెల్లించాలని బాధిత రైతులంతా జిల్లా కలెక్టర్, రాష్ట్ర ఉద్యానశాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో బత్తాయి చెట్లను పరిశీలించాలని రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ నాగపూర్ శాస్త్రవేత్తలకు లేఖ రాశారు.

ఎటూ తేల్చని శాస్త్రవేత్తలు

రైతులు నాటిన బత్తాయి తోటలను పరిశీలించిన తెలంగాణ, ఏపీ యూనివర్సిటీలకు చెందిన శాస్త్రవేత్తలు దిగుబడి రాకపోవడంపై ఎటూ తేల్చలేదు. యూనివర్సిటీ నుంచి తెచ్చిన మొక్కలు నాణ్యతగా అంటుకట్టలేదని ఎక్కడో బయట వయసు మీరిన మొక్కల నుంచి కొమ్మలు తెచ్చి అంటుకట్టడంతోనే దిగుబడిలో తేడాలున్నట్లు రైతులు అనుభవపూర్వకంగా చెబుతున్నారు. రైతులు తెచ్చి నాటిన మొక్కల మూలాలు ఎక్కడ నుంచి తెచ్చారో శాస్త్రీయ పరిశోధన(డీఎస్‌ఏ) చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఉద్యాన యూనివర్సిటీలో శాస్త్రవేత్తల కొరత కారణంగా మొక్కలు అంటుకట్టి రైతులకు ఇవ్వడంలో మమ అనిపించినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. నల్లగొండ జిల్లాకు పండ్ల మొక్కలు అందించేందుకు కొండమల్లేపల్లిలో పండ్ల మొక్కల పరిశోధన కేంద్రం ఉన్నప్పటికీ శాస్త్రవేత్తలు లేక పరిశోధన కేంద్రం పడావు పడింది. ఈ కేంద్రంలో కేవలం నిమ్మ మొక్కలను మాత్రమే అంటుగడుతున్నారు.

శాస్త్రవేత్తలు పరిశీలించాల్సి ఉంది



దిగుబడి రాకపోవడం విషయమై ఉద్యాన శాఖ నుంచి నాగపూర్ సైంటిస్టులకు నివేదించాం. రైతులు నాగాపూర్ శాస్త్రవేత్తలతో పరిశోధన చేయించాలని కోరారు. ఏడాది పాటు సస్యరక్షణ చర్యలు సక్రమంగా చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని ఏపీ, తెలంగాణకు చెందిన ఉద్యాన యూనివర్సిటీ శాస్త్రవేత్తలు సూచించారు. నాగాపూర్ శాస్త్రవేత్తల క్షేత్రస్థాయి పరిశీలన చేసిన తర్వాతే సమస్యకు పరిష్కారం లభిస్తుంది.
– సంగీతలక్ష్మి, జేడీ, జిల్లా ఉద్యాన శాఖ

దిగుబడి సరిగ్గా లేదు



2014లో తిరుపతి యూనివర్సిటీ నుంచి 300 మొక్కలు తీసుకొచ్చి నాటాను. కాయ దిగుబడి నాణ్యతగా లేకపోవడంతో పాటు బంక తెగులుతో వంద మొక్కలు ఎండిపోయాయి. ఎకరానికి 10 టన్నుల దిగుబడి రావల్సి ఉండగా 5 టన్నుల దిగుబడి వస్తుంది. కాయ సైజు పెద్దగా ఉండటం లేదు. ధర లేనప్పుడు తోట మీదనే బత్తాయిని తెంపకుండా ఆపితే 2, 3 రోజుల్లోనే పసుపు రంగులోకి మారి మొత్తం రాలిపోతుంది. 8 ఏళ్లుగా ఆదాయం లేకపోగా కనీసం పెట్టుబడి కూడా గిట్టుబాటు కావడం లేదు. శాస్త్రవేత్తల బృందం తోటను పరిశీలించి సక్రమంగా సస్యరక్షణ చర్యలు చేపట్టలేదని చేతులు దులుపుకున్నారే తప్ప ఇచ్చిన మొక్కల నాణ్యత విషయమై స్పష్టత ఇవ్వలేదు. యూనివర్సిటీ వారు ఇచ్చిన అంటు మొక్కల్లో నాణ్యత లేదు. నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.
– సీహెచ్. శ్రీధర్‌రెడ్డి, పిట్టలగూడెం, గుర్రంపోడు మండలం

ఇళ్ల కూల్చివేతపై సుందర్‌నగర్ వాసుల ధర్నా

- కూల్చివేతలపై మున్సిపల్ కమిషనర్, చైర్మన్ల మధ్య వాగ్వాదం
- బాధితుడి ఇంటిని పరిశీలించిన కమిషనర్, చైర్మన్



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సుందర్‌నగర్ వాసులు

మిర్యాలగూడ టౌన్ : అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారి జోలికి వెళ్లకుండా నిరుపేదల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని కూల్చివేశారంటూ మిర్యాలగూడ మున్సిపాలిటీ 36వ వార్డు సుందర్‌నగర్ కాలనీ వాసులు శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ముందుగా మున్సిపల్ ఛాంబర్స్‌లోకి వెళ్లి కమిషనర్ యూసుఫ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో మున్సిపల్ కమిషనర్ యూసుఫ్, మున్సిపల్ చైర్మన్ తిరునగర్ భార్గవ్‌ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో కొంత సేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో కొంత మంది కాలనీవాసులు జోక్యం చేసుకొని అలసు పేదవాడి ఇళ్లను ఎవరు కూల్చమన్నారో చెప్పాలని పట్టుబట్టారు. అదే సమయంలో బాధితుడు దండగల రంగయ్య తాను ఆత్మహత్య చేసుకుంటాను అని ఆవేదనతో మాట్లాడంతో ఒక్కసారిగా మరింత వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ విషయం తీసుకున్న టూటౌన్ పోలీసులు మున్సిపాలిటీకి వచ్చారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ తాను 36వ వార్డు సుందర్‌నగర్‌లో నాలా పక్కన 15 ఏళ్ల క్రితం ఒక్క చిన్న ఇంటిని నిర్మించుకోని జీవనం కొనసాగిస్తున్నానని, తనకు పట్టా కూడా ఉందని, తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే మున్సిపాలిటీ వారు వచ్చి ఇంటిని కూల్చివేశారని సర్వ కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తన వస్తువులు కూడా తీసుకోనివ్వకుండా వెంటనే కూల్చివేశారన్నారు. నాలా పక్కనే ఇంకా అనేక కట్టడాలు ఉంటే వాటిని దాటి తన ఇంటి వద్దకు వచ్చి కూల్చడమేమిటని అధికారులను ప్రశ్నించారు. దీనిక వెనక ఓ అధికార పార్టీ నేత హస్తం ఉందని ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. మరో బాధితుడు తంబిశెట్టి శ్రీను మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాలా పక్కన ఉన్నదనే కారణంతో తన ఇంటి బెస్‌మెంట్ తొలగించడం అన్యాయమన్నారు. అధికార పార్టీని వారికిపేదలంటే ఇంత కక్ష ఉందా అని ప్రశ్నించారు. నాలాపై అనేక మంది నిర్మాణాలను చేపట్టారని వారి కూడా కూల్చివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌లు బాధితుల ఇంటిని పరిశీలించారు.

లారీని ఢీకొట్టిన డీసీఎం

- డీసీఎంలో విశ్రాంతి తీసుకుంటున్న డ్రైవర్ మృతి



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన డీసీఎం క్యాబిన్

కట్టంగూర్: మండల కేంద్రంలోని 65వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంజాబ్ రాష్ట్రం సంగ్రూర్ జిల్లా సునమ్ సతాజ్ గ్రామానికి చెందిన కుల్విందర్ సింగ్ (25), రాజ్‌బిందర్‌సింగ్‌లు డీసీఎంలో ప్లాస్టిక్ డబ్బాల లోడ్‌తో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్నారు. వాహనాన్ని రాజ్‌బిందర్‌సింగ్ నడుపుతుండగా.. కుల్వీందర్ సింగ్ డీసీఎంలో ఎడమ వైపున విశ్రాంతి తీసుకుంటున్నాడు. కట్టంగూర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్దకు రాగానే పాలిష్ బండల లోడ్‌తో హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీని వేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో డీసీఎంలో విశ్రాంతి తీసుకుంటున్న కుల్వీందర్ సింగ్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. డీసీఎం నడుపుతున్న రాజ్‌బిందర్‌సింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీను తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య



భిక్షపతి నాయక్ (ఫైల్)

బొమ్మలరామారం: ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బొమ్మలరామారం మండలంలో శుక్రవారం చోటు చేసుకోగా.. శనివారం వెలుగులోకివచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మైలారంకింది తండాకు చెందిన దీరావత్ భిక్షపతి నాయక్(24) రాంపల్లిలోని ఆర్‌ఎంసీ ప్లాంట్‌లో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. భిక్షపతి నాయక్ తండ్రి మంగ్యా చాలా కాలం క్రితమే చనిపోగా.. తల్లి వాల్కి రెండు నెలల క్రితం మృతిచెందింది. దీంతో తన అక్కతోపాటు తండాలో జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో భిక్షపతి నాయక్ మనస్తాపానికి గురై ఇంట్లో తన అక్క లేని సమయంలో శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికి తిరిగి వచ్చిన అతడి అక్క తలుపు కొట్టినా తీయక పోవడంతో కిటిలోంచి చూసి తమ్ముడు ఉరివేసుకున్నట్లు గుర్తించింది. ఇరుగు పొరుగు వారితో తలుపులు తీయించి వచ్చి చూసేసరికి అప్పటికే భిక్షపతి నాయక్ మృతి చెందాడు. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాఘవేందర్ గౌడ్ శనివారం తెలిపారు.

సమగ్ర కులగణన జరపాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

నకిరేకల్: కేంద్ర ప్రభుత్వం సమగ్ర కులగణన చేసి స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. నకిరేకల్‌లో శనివారం నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా బీసీలు ఎంత జనాభా ఉన్నారు.. వారికి విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని కోరారు. చట్ట సభల్లో మన వాటా, మన హక్కు మనకు దక్కాలంటే జెండాలు, పార్టీలను పక్కన పెట్టి పోరుబాట పట్టాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన కామారెడ్డి నుంచి సమగ్ర కులగణన సాధన యాత్ర ప్రారంభించామని, ఈనెల 31న కరీంనగర్‌లో ముగుస్తుందని తెలిపారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సకినాల రవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బీసీ కుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు కుందారపు గణేష్‌చారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అర్రురి వెంకటేశ్వర్లు, సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సకినాల రవి, యాదవ, రజక పద్మశాలి సంఘాల అధ్యక్షులు తిరుగుడు రవి, పగిళ్ల వెంకన్న, చిలుకూరి లక్ష్మీనర్సయ్య, సైదులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి



అనంతరెడ్డి (ఫైల్)

రాజాపేట: వ్యవసాయ పనులు చేస్తుండగా ఓ రైతు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం రాజాపేట మండలంలోని కుర్రారం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నిమ్మల అనంతరెడ్డి (50) రోజుమాదిరిగా తన వ్యవసాయ బావివద్దకు వెళ్లాడు. మోటార్ నీళ్లు పోయకపోవడంతో దానిని సవరిస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడు. రాత్రివరకు అనంతరెడ్డి ఇంటికి రాకపోవడంతో భార్య అంజమ్మ ఇరుగుపొరుగువారితో కలిసి పొలం వద్దకు వెళ్లి చూడగా.. భర్త బావిలో అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. దీంతో అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఉపేందర్ తెలిపారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. కాగా.. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

రెండిళ్లలో చోరీ

- తులం బంగారం, 16 తులాల వెండి అపహరణ

దేవరకొండ: దేవరకొండ మండల పరిధిలోని కాసారం గ్రామంలో రెండిళ్లలో చోరీ జరిగింది. సీఐ నరసింహులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆంబోజు లింగమ్మ శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలో పొలం పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లింది. తిరిగి సాయంత్రం వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చింది. లింగమ్మ ఇంట్లో ఉన్న తులం బంగారంతో పాటు రూ.3వేలు నగదు అదే విధంగా పక్కనే ఉన్న తన కుమారుడి ఇంట్లో ఉన్న 16 తులాల వెండి రూ.5వేల నగదు అపహరణకు గురైనట్లు తెలిపారు. ఈ మేరకు శనివారం లింగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు.

మార్కెట్ ధరలో సగమైనా పరిహారం చెల్లించాలి



రైతులతో మాట్లాడుతున్న చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి: రంగారెడ్డి జిల్లా సరిహద్దులో ఉన్న పిలాయిపల్లి గ్రామంలో ఎకరం భూమి విలువ మార్కెట్‌లో రూ.కోటి ఇరవై లక్షలు ఉందని, కనీసం అందులో పరిహారం సగమైనా చెల్లించాలని గౌరెల్లి భద్రాద్రి జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో గౌరెల్లి నుంచి భూదాన్‌పోచంపల్లి మీదుగా వలిగొండ వరకు చేపట్టిన 930పీ జాతీయరహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న పిలాయిపల్లి, జూలూరు గ్రామాల రైతులతో చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి ఫైనల్ పబ్లికేషన్ అవార్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు కోల్పోతున్న భూములు, ఆస్తుల వివరాలను చదివి వినిపించారు. అనంతరం ఆర్డీఓ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. పిలాయిపల్లిలో 57 మంది రైతుల నుంచి 30 ఎకరాలు, జగత్‌పల్లిలో 25 మంది రైతుల నుంచి 10.6 ఎకరాలు జాతీయ రహదారి కోసం సేకరిస్తున్నామని తెలిపారు. పరిహారం పెంపువిషయమై ఏమైనా అభ్యంతరాలు ఉంటే కలెక్టర్‌కు విన్నవించుకోవచ్చునని పేర్కొన్నారు. జాతీయ రహదారి నిర్మాణానికి రైతులంతా సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సురేందర్‌శర్మ, ఎంఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, ఏఆర్‌ఐ నర్సింహారెడ్డి, మండల సర్వేయర్ సాయికుమార్, రైతులు కళ్లెం రాఘవరెడ్డి, పక్కీరు దయాకర్‌రెడ్డి, బానాల ఎల్లారెడ్డి, ఇటమోని మహేశ్, యాదిరెడ్డి పాల్గొన్నారు.

గురుపూర్ణిమకు సాయినాథుడి మందిరం ముస్తాబు



ఉత్సవాలకు ముస్తాబైన సాయి మందిరం

చింతపల్లి : మండల కేంద్రంలోని షిర్డీ సాయి బాబా దేవాలయం ఆదివారం నిర్వహించనున్న గురిపూర్ణిమ ఉత్సవాలకు సిద్ధమైంది. గురిపూర్ణిమ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం శంఖాభిషేకంతో పూజా కార్యక్రమాలు ప్రారంభించనున్నారు. 5గంటలకు నగర సంకీర్తన, 5.30 గంటలకు కాగడ హారతి, గణపతి హోమం,6.30కి పంచామృతాభిషేకం, 7.30కి సంస్థాన హారతి, అష్టోత్తర పూజ, 10.30గంటలకు యోగశాలలో పూర్ణాహుతి, 11 గంటలకు శంకుపూజ, 12 గంటలకు మధ్యాహ్న హారతి, 12.30గంటల నుంచి భక్తులో శంకులతో సాయినాథునికి వైభవంగా లక్ష మల్లెలతో పుష్పార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు కొడకొండ్ల శ్రీరామశర్మ, శివచరణ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించనున్నారు.

జాతీయ రహదారిపై సిమెంట్ ట్యాంకర్ బోల్తా



బోల్తాపడిన సిమెంట్ ట్యాంకర్

చౌటుప్పల్ : మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామంలో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై శనివారం సిమెంట్ ట్యాంకర్ పల్టీ కొట్టింది. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు నుంచి సిమెంట్ లోడ్‌తో హైదరాబాద్ వెళ్తున్న ట్యాంకర్ తూప్రాన్‌పేట శివారులో ఒక్కసారిగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలుకాలేదు. ట్యాంకర్ బోల్తా పడిన సమయంలో రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో నాలుగు గొర్రెపొట్టేళ్లు మృతి

మద్దిరాల : మండల పరిధిలోని కుక్కడంలో విద్యుదాఘాతంలో నాలుగు గొర్రెపొట్టేళ్లు మృతి చెందాయి. బాధితుడు తెలిపిన ప్రకారం.. కుక్కడం గ్రామానికి చెందిన వల్లపు నర్సయ్య తన గొర్రెపొట్టేళ్లను మేపుతుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైరు వాటికి తగిలింది. దీంతో విద్యుదాఘాతం ఏర్పడి నాలుగు గొర్రెపొట్టేళ్లు మృతిచెందాయి. వాటి విలువ రూ.50వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

కుక్కదాడిలో ఒకరికి తీవ్రగాయాలు

నార్కట్‌పల్లి: కుక్కదాడి చేసిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం నార్కట్‌పల్లిలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ఉప్పలయ్య హైస్కూల్ సమీపంలో 11వ వార్డులో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న రంగయ్య ఇంటి ముందు నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో రంగయ్యకు చెందిన కుక్క ఉప్పలయ్యను కరవడంతో కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా.. గతంలో ఇదే కుక్క 20 మందిని కరిచినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

నేత్రపర్వంగా నిత్యకల్యాణం

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి నిత్యకల్యాణ వేడుక శనివారం నేత్రపర్వంగా చేపట్టారు. వేకువజామునే గర్భాలయంలో సుప్రభాత సేవ చేపట్టిన అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళ అర్చన చేశారు. ఇక ఆలయ మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ ప్రాకార మండపంలో ఊరేగించారు. నిత్యకల్యాణం, వేద ఆశీర్వచనం, సువర్ణ పుష్పార్చన వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చిత్తడి రోడ్డు.. విద్యార్థుల పాట్లు



బురద రోడ్డులో పాఠశాలకు నడుచుకుంటూ వెళ్తున్న కొత్తపహాడ్ గ్రామానికి చెందిన విద్యార్థులు

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్–కొత్తపేట గ్రామాల మధ్య ఉన్న లింక్‌రోడ్డు అధ్వానంగా మారింది. కొర్లపహాడ్ గ్రామంలో ఉన్న ఆదర్శ పాఠశాలకు కొత్తపేట గ్రామం నుంచి 50 మంది విద్యార్థులు వెళ్తుంటారు. ఎలాంటి బస్సు, ఆటో సౌకర్యం లేకపోవడంతో కాలినడకన బురద రోడ్డుపై నడిచివెళ్లాల్సి వస్తోంది. కొత్తపేట, కొర్లపహాడ్ గ్రామాలకు చెందిన రైతుల పొలాలు కూడా ఈదారి వెంటే ఉన్నాయి. కొత్తపేట నుంచి నకిరేకల్ పట్టణానికి వెళ్తే ద్విచక్ర వాహనదారులు సైతం ఈదారి గుండానే వెళ్తారు. మూడు కిలోమీటర్లు ఉన్న ఈరోడ్డు మట్టిరోడ్డు కావటంతో ఇటీవల కురిసిన వర్షాలకు చిత్తడిగా మారింది. దీంతో వాహనదారులు, రైతులు నానా ఇబ్బందులు పడుతూ ప్రయాణం సాగిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీరోడ్డుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

యువతి అదృశ్యం

రామగిరి (నల్లగొండ): తిప్పర్తి మండలంలోని పెద్ద సూరారం గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైంది. గ్రామానికి చెందిన గుండె ఐశ్వర్య (19) శుక్రవారం కిరాణాషాపునకు సరుకులు తీసుకురావడానికి వెళ్లి తిరిగి రాకపోవడంతో తండ్రి కోటయ్య శనివారం తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.